ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు

రూ.1.63 కోట్లతో పనులు ప్రారంభం



లక్ష్మీప్రియ కాలనీలో కొనసాగుతున్న పనులు

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: రోడ్లపై ఇష్టానుసారంగా తవ్వకాలు జరపటం, పనుల అనంతరం మరమ్మతులు చేయకపోవటంతో వర్షాకాలంలో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లన్నీ ఛిద్రమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై గత నెల 17న 'రోడ్లు చిద్రం.. జర్నీ జర భద్రం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్థానిక బిల్డర్ బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి స్పందించి రూ.5 లక్షల సొంత డబ్బుతో పలు చోట్ల రోడ్లకు మరమ్మతులు చేయించారు. సమాచారం తెలుసుకున్న మున్సిపాలిటీ అధికారులు పనులు నిలిపివేయాలని, మున్సిపాలిటీ తరఫున చేపడతామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరధిలో ధ్వంసమైన రోడ్లను గుర్తించి రూ. 1.63 కోట్లతో వాటి మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలకు టెండర్‌లు పిలిచారు. గత నెల 30న టెండర్ ప్రక్రియ పూర్తి కావటంతో శనివారం నుంచి 7వ వార్డు నెక్నాంపూర్, చింతచెట్టు సర్కిల్, వెంకటేశ్వరకాలనీ సమీపం, 8వ వార్డులో అలకాపూర్ నుంచి నెక్నాంపూర్ రోడ్డు, 9 వ వార్డులో గో గ్రీన్ కాలనీ రోడ్డు, 15వ వార్డులో సుహ అపార్ట్‌మెంట్ నుంచి లక్ష్మీప్రియకాలనీ మీదుగా గాయత్రి అపార్ట్‌మెంట్స్ వరకు ఉన్న రోడ్ల మరమ్మత్తు పనులను ప్రారంభించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



వెంకటేశ్వరకాలనీ సమీపంలో ప్యాచ్‌వర్క్‌ను పరిశీలించిన ఏఈ సంజయ్, కౌన్సిలర్ పద్మారావు

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: 4వ డివిజన్, 5వ డివిజన్, 17వ డివిజన్‌లల్లో పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శనివారం ఉదయం 6 గంటలకు 5వ డివిజన్ ఎస్ఎంపీ రోడ్డు మార్కెట్, 17వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో ప్రతి శుక్రవారం జరిగే మార్కెట్‌లలో స్వీపింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. 4వ డివిజన్‌లోని హైదర్షాకోట్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణను పరిశీలించారు. మార్కెట్‌ల నుంచి వచ్చే కూరగాయలను కంపోస్టుగా తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, రాము, స్వీపర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



చెక్కులను అందించిన ఉపేంద్రనాథ్‌రెడ్డి

మణికొండ: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ఇంటర్‌మీడియట్ చదివేందుకు డబ్బులు లేని విషయం తెలుసుకుని మణికొండ వీఆర్‌ఫర్ సహాయోగ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందించారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూజాసింగ్, చక్రికలను స్థానిక శ్రీ చైతన్య కళాశాలలో సదరు సంస్థ చేర్పించింది. గతంలో వారికి మొదటి విడత ఫీజు చెల్లించగా, శనివారం రెండవ విడత ఫీజును ది సిటిజన్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి చెక్కుల రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బి.పద్మారావు, ఎ.నవీన్‌కుమార్, ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డి.సీతారాం, కార్యదర్శి షేక్ ఆరీఫ్, కోశాధికారి దిలీప్‌కక్కడ్, నాయకులు నరోత్తం సింగ్, టి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నవయువయూత్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు అనిత, బాబుల్‌రెడ్డినగర్ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డిలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జంగయ్య, ప్రదీపలు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు సమయస్ఫూర్తితో విద్యాబోధనలు చేశామన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనిత, క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్: బీజేపీ రంగారెడ్డి కార్యకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని పట్టణంలోని తొండుపల్లి ఎంఎస్ గార్డెన్‌లో శనివారం చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సర్కారు లక్షల కోట్ల నిధులు విడుదల చేసినా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాత్రం కేంద్రంపై బురదజల్లుతున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్ అన్నది దేశం మొత్తానికి సంబంధించి రాష్ట్రాల పేర్లను ఉటంకించి బడ్జెలు చదవరనే విషయం ఆ రెండు పార్టీల నాయకులకు తెలియదా అని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో ఎంపీ సీట్లు తక్కువొచ్చినా, ఓటింగ్ శాతంలో మాత్రం బీజేపీ మరో మెట్టు ఎక్కిందన్నారు. తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జిగా చంద్రశేఖర్‌జీ, మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్యగౌడ్, కేంద్ర బీసీ కమిషన్ మాజీసభ్యులు ఆచారి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వై. శ్రీధర్, పాపయ్య, బుక్క వేణుగోపాల్, రాజ్‌భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' పై సమావేశం



అధికారులతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న 'స్వచ్ఛందనం-పచ్ఛదనం' కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు విజయవంతం చేయాలని సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రవి కుమార్ అన్నారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన స్వచ్ఛందనం-పచ్ఛదనంపై ఇంజనీరింగ్, శానిటేషన్, యుసీడీ, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

మళ్లీ పగిలిన పైప్‌లైన్

మణికొండ: గత వారంలోనే రెండు సార్లు పగిలిన మంజీరా మంచినీటి పైప్‌లైన్ శనివారం పెద్దాపూర్ నుంచి సింగాపూర్ మధ్యలో మరోమారు పగిలింది. తరచూ పైప్‌లైన్లు పగలటం, పగిలిన ప్రతిసారి రెండు, మూడు రోజులు నీటి సరఫరాకు అంతారాయం కలుగుతుండటంతో జంట మున్సిపాలిటీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 1600 డయా పైప్‌లైన్‌లో నిండుగా రావాల్సిన నీరు కేవలం 750 డయా నీరు మాత్రమే వస్తుందని జలమండలి డివిజన్ జీఎం మహేందర్ నాయక్ తెలిపారు. పైప్‌లైన్ మరమ్మత్తు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఆదివారం వరకు పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అప్పటి వరకు నీటి సరఫరా తక్కువగా రావటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోను కాలనీలకు తగ్గించి సరఫరా చేస్తామన్నారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడి సహకరించాలని ఆయన సూచించారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందించి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పైప్‌లైన్ పగలటంతో చెరువును తలపిస్తున్న లీకేజీ నీరు

5 నుంచి 'స్వచ్ఛదనం- పచ్చదనం'

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ఈనెల 5వ తేది నుంచి 9వ తేది వరకు 'స్వచ్ఛదనం- పచ్ఛదనం' కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశం మేరకు నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు, కాలనీసంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రం చేయటం, చెత్తను తడి-పొడిగా ఇవ్వాలని సూచించటం, సీజినల్ వ్యాధులు రాకుండా అడ్డుకోవటం, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించటం, దోమల వృద్ధిని నివారించటం, రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటడం, ఇంటింటికి మొక్కల పంపిణీ చేయటం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి వార్డు వారిగా అధికారులను నియమించామని, కౌన్సిలర్‌ల ఆధ్వర్యంలో రోజు వారి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్‌లోని కౌన్సిల్‌హాల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం పై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వాయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఆగస్టు 5న స్వచ్ఛదనం-పచ్ఛదనం ప్రారంభ కార్యక్రమం ఉంటుందని, ఆగస్టు 6న తాగునీరు, వర్షపు నీరు సంరక్షణ, 7న కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలలో, గోతులు పూరించడం, 8న ఆరోగ్యం-వీధి కుక్కలపై దృష్టి పెట్టడం, 9న ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాలను శుభ్రపరచడం పై కార్యక్రమాలను ప్రతి డివిజన్‌లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాము, శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రవంతి నరేందర్, పద్మావతిపాండు, అస్లాం, మేనేజర్ మంజులత, డిఈఈ, ఏఈ, ఎస్ఐ, టిఎంసీ, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, మెప్మా, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి

హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో అధిక రాబడి తీసుకొచ్చిన వారికి, వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేసేవారికి తగిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. నిరంతరం విధులను నిర్వహించేవారికి ఆటవిడుపుగా వాలీబాల్ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను విస్తరించండి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లు ఇరుకుగా మారడంతో వాహనాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ పనులను చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. హైదర్షాకోట్ పర్మాయిషీ హోటల్ నుంచి కేంద్రీయ విహార్ వరకు 40 ఫీట్ రోడ్డు వెడల్పును చేయాలని, శివశక్తి ఫ్యాక్టరీ నుంచి బైరాగిగూడ వరకు 50 ఫీట్ల రోడ్డును వెడల్పు చేయాలని సూచించారు. పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కె.రాంప్రసాద్‌రావు, లక్ష్మణ్, కుమార్, శంకర్, శ్రీనివాస్, విజయ్ తదితరులున్నారు.



రోడ్డు పనుల పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

హెచ్‌సీయూలో క్లీన్ అండ్ గ్రీన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శనివారం 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ డా.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని జాకీర్ హుస్సేన్ భవనం సర్కిల్‌లోని ఓల్డ్ స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రాంతంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు వృద్ధాలు, చెట్ల కొమ్మలు తొలగించారు. అనంతరం హరిత మహోత్సవంలో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటారు.

మరోసారి కబ్జాకు యత్నం

శంషాబాద్: సుప్రీం కోర్టు సైతం హెచ్ఎండీకు సంబంధించిన భూముల వివాదంపై స్పష్టత ఇచ్చినప్పటికీ కబ్జారాయుళ్లు మరోసారి తెగబడ్డారు. పట్టణంలోని హెచ్ఎండీఏకు సంబంధించిన సర్వేనంబరు 725లో శనివారం సాయంత్రం కొందరు వ్యక్తులు నాలుగు జేసీబీలను తీసుకుని వచ్చారు. భూములు తమకు చెందినవేనంటూ వాటిని చదును చేసేందుకు రంగంలోకి దిగారు. అదే సమయంలో అక్కడే ఉన్న హెచ్ఎండీఏ సిబ్బంది విషయం గమనించడంతో వారు వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సంఘటన స్థలంలోకి చేరుకోవడంతో కబ్జారాయుళ్లు అక్కడి నుంచి పారిపోయారు. ఖలీద్, షాబూన్ అనే వ్యక్తులు ఈ వ్యవహారంలో ప్రధానసూత్ర ధారులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రషీద్, నందు, నిసార్ ముగ్గురు జేసీబీ డ్రైవర్లను అరెస్ట్ చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు. సుప్రీం కోర్టు ప్రభుత్వ స్థలమని తేల్చినప్పటికీ అక్రమార్కులు మరోమారు దీనిపై కన్నేయ్యడం చర్చనీయాంశంగా మారింది.

మొక్కల పెంపకం అవసరాన్ని గుర్తించాలి

రాయదుర్గం: మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యత అందరిపైన ఉందని రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెంవీరయ్య అన్నారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లోని రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ కార్యాలయంలో మొక్కల పెంపకం, అటవీ అభివృద్ధి, ఎకో టూరిజమ్‌పై ఆయన శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హరితహారం కార్యక్రమం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతను అందరూ గుర్తించాలన్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో ప్లాంటేషన్, హార్వెస్టింగ్‌పై ప్రత్యేకంగా సమీక్షించారు. వెదురు, యూకలిప్టస్ చెట్ల అమ్మకాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారి రంజిత్‌నాయక్, సీజీఎం డివిరెడ్డి, అధికారులు స్కైలాబ్, మెదక్, వరంగల్, రంగారెడ్డి, సత్తుపల్లి, పాల్వంచ, కొత్తగూడెం డివిజన్లకు చెందిన డీఎంలు, బొటానికల్ గార్డెన్ ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవాలి

మణికొండ: పేదపిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, క్రీడా సామాగ్రిలను సమకూర్చేందుకు సేవా సంస్థలు, ఐటీ సంస్థలు ముందుకు వచ్చి నిధులను కేటాయించి ఆదుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు అన్నారు. కోకాపేటలో ఫ్రాంక్లీ టెంపుల్, ఇండియా రౌండ్ టేబుల్ సంస్థలు నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ మున్సిపాలిటీతో పాటు పక్కనే ఉన్న ఐటీ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను ఎక్కడో ఖర్చుచేసే బదులుగా మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, బస్తీ దవఖాణాలకు వినియోగిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాంటి సంస్థలకు తాము పూర్తి సహకారం అందించటంతో పాటు వారి సేవలను గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, బట్టాచార్య, అజయ్, నాగలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభించిన వైస్ చైర్మన్, సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

యోగాలో ఉద్యాన విద్యార్థుల ప్రతిభ

ఏజీవర్సిటీ: 38వ జిల్లా స్థాయి యోగాసనా ఛాంపియన్స్ 2024-25 పోటీలలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ యోగా అసోసియేష ఆధ్వర్యంలో తెలంగాణ యోగా అసోసియేషన్ జిల్లా స్థాయి పోటీలను శనివారం వనిత మహావిద్యాలయం కాలేజ్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ నాంపల్లిలో నిర్వహించారు. ఇందులో కొండా లక్ష్మణ్, ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ అత్యుతమ ప్రతిభ చాటారు. ఈ పోటీలలో పాల్గొన్న బీఎస్సీ హర్టికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థిని సాహిత్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని గెలుచుకోగా, రిచిత మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. దీంతో వారిరువురిని విశ్వవిద్యాలయం అసోసియోట్ డీన్ ప్రశాంత్, ఇతర ప్రొఫెసర్లు అభినందించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే మానసిన ప్రశాంతతతో పాటు ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఓఎస్ఏ డాక్టర్ నాగహర్షిత,పిజికల్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగాలో ప్రతిభ చాటిన విద్యార్థినిలు





ఆసనాలతో అబ్బురపరచిని సాహిత్య ,రిచిత

విద్యార్థులకు ఫెలోషిప్

ఏజీవర్సిటీ: అమెరికాలో ఉన్నత విద్య చదువుకోవడానికి ఎన్నికైన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన వన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఫెలోషిప్‌ను అందిస్తుంది. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు శనివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల విద్యార్థులు మానవ వనరుల అభివృద్ధి కోసం ప్రపంచంలో ఉత్తమ ల్యాబోరేటరిస్‌ల పని అనుభవం పొందేందుకు ఈ ఓవర్సీస్ ఫెలోషిప్‌ను అందిస్తోంది. పైలట్ ప్రాతిపదికన రెండు విశ్వవిద్యాలయల నుంచి ఇద్దరి చొప్పున నలుగురు విద్యార్థులకు ఒకొక్కరికి 55.50 లక్షల చొప్పున నలుగురి విద్యార్థులకు 2కోట్ల 22 లక్షల రూపాయలు కేటాయిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఈ ఓవర్సీస్ ఫెలోషిప్‌ను 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేయనున్న విద్యార్థులకు అందించనుంది. అలాగే ఆబర్న్ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సును చదువునున్న విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం అందినుంది. విద్యార్థులకు అమెరికా స్టడీ వీసాను పొందడానికి, ఇతర సహాయ సహకారం అదించడానికి ప్రభుత్వం తోడ్పాటు ఇవ్వనుంది. ఇక మంత్రిని కలిసిన వారిలో ఇంఛార్జీ ఉపకులపతి రఘునందన్‌రావు, విస్తరణ సంచాలకులు జమునారాణితో పాటు తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన అధికారులు, విద్యార్థులు

సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనందించాలి

అత్తాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖ ఆలోచనలు మేరకు శనివారం రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నేషనల్ అచీవ్మెంట్ సర్వే జరిగింది. ఇటీవల బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కె.శంకర్ రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న మాజీ హోం మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఈ పాఠశాల విద్యార్థులేనంటూ గుర్తుచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి విద్యార్థులకు బోధించాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు సుదర్శన్, జనార్ధన్‌చారి, వెంకటయ్య, నిర్మల, జ్యోతి, సునీత, బాలస్వామిరెడ్డి, సురేష్ ముదిరాజ్, గంగయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో శంకర్ రాథోడ్

మత్తుకు బానిసలు కాకుండా ఉండాలి



మాదకద్రవ్యాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని వాంబేకాలనీ, రాజీవ్ గృహకల్ప పింక్ బిల్డింగ్, వైట్ బిల్డింగ్‌లలో నివసిస్తున్న ప్రజలకు మాదకద్రవ్యాల గురించి శుక్రవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ నరేందర్ వివరించారు. ఈ నేపథ్యంలో పలు షాపులలో పోలీస్ బలగాలతో వచ్చి తనిఖీలు నిర్వహించారు. కొన్ని షాపులలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించడంతో వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ.. యువకులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధవహించాలని కోరారు. గంజాయి అమ్ముతున్న వారి వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని స్థానిక ప్రజలను కోరారు. తమ పిల్లలను మత్తుకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పైడి నాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్‌కు నివాళులు

మణికొండ: దశబ్దాలుగా మాదిగల వర్గీకరణకు పోరాటం చేసి ఎట్టకేలకు సుప్రీం కోర్టు ఉన్నత బెంచ్ దానికి మద్దతుగా తీర్పు రావటంతో గండిపేట మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నార్సింగిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇంఛార్జి గణేష్ మాదిగ, జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్ మాదిగలు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దశబాద్దాలుగా పోరాటం చేశామన్నారు. ఎట్టకేలకు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించటం, సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని అమలు చేస్తామని హామీ ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడైనా ఎస్సీలకు ఉద్యోగాలు, ప్రమోషన్‌లు, విద్యా తదితర రంగాలలో ఎంతో మేలు జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికాంత్, వేణు కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు